ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేశ్

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పక్కా ప్రణాళికతో మౌలిక వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్లు సంచిత్‌గంగ్వార్, నగేశ్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ, పౌరసరఫరాల, మార్కెటింగ్ శాఖల అధికారులు, ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా, రైస్‌మిల్లర్లతో ధాన్యం కొనుగోలు కేంద్రాలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లాలో 297 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామన్నారు. 4 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కేంద్రాలకు వస్తుందని అంచనా వేశామన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ఇవ్వనున్నామన్నారు. సమావేశంలో పౌరసరఫరాల డీఎం ఇర్ఫాన్, డీఎస్‌వో ప్రసాదరావు, డీసీఎస్‌వో కాశీవిశ్వనాథ్, డీఆర్డీవో ఉమాదేవి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోవిందునాయక్, మార్కెటింగ్ అధికారి స్వరణ్‌సింగ్, ఆయాశాఖల సిబ్బంది, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌ఛార్జులు, మెప్మా, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యం వెలికితీసేందుకు సీఎం కప్ పోటీలు


క్రీడాజ్యోతిని అందుకుంటున్న అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్, చిత్రంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు సీఎం కప్ ఎంతో దోహదపడుతుందని అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్ అన్నారు. సెప్టెంబరులో ప్రారంభం కానున్న సీఎం కప్ సంఘీభావ ఊరేగింపును శుక్రవారం వనపర్తి బాలుర ఉన్నత పాఠశాల ఆవరణ నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల మొదటి వారంలో సీఎం కప్ క్రీడా పోటీలు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో జరుగుతాయన్నారు. విజేతలు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటారన్నారు. డీఎస్పీ వెంకటేశ్వరావు మాట్లాడుతూ ఆటలతో ఆరోగ్యంతో పాటు మానసిక వికాసం, క్రీడా స్ఫూర్తి అలవడుతుందన్నారు. కార్యక్రమంలో క్రీడా ఇన్‌ఛార్జులు గోకుల్, రతన్‌కుమార్ బోస్, మధు, జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ లోపం.. దుర్గంధ భరితం

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

> పట్టణాల్లోని సామూహిక మరుగుదొడ్లు అపరిశుభ్రతకు నిలయంగా మారాయి. వాటిని నిర్మించిన కొత్తలో నిర్వహణలో శ్రద్ధ వహించిన పురపాలక పారిశుద్ధ్య సిబ్బంది అనంతరం నిర్లక్ష్యం చేస్తున్నారు. కొన్ని చోట్ల తలుపులు లేవు. నీటి వసతి కల్పించక, మరమ్మతులు చేపట్టక మూతబడ్డాయి. పట్టణాలకు పనుల నిమిత్తం వచ్చే వారి ఇబ్బందులు చెప్పుకోలేనివి. వీటి నిర్వహణకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కార్మికులకు 15 నెలల నుంచి గౌరవ వేతనం అందడం లేదు.

తలుపులు లేవు


కమలానగర్ రోడ్డులో ఇలా..

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : రాయిగడ్డలోని ప్రాథమిక పాఠశాల సమీపంలో 8 మరుగుదొడ్లు ఉండగా అందులో రెండు గదులకు తలుపులు లేవు. కమలానగర్ రోడ్డులో ఉన్న వాటిలో ఒకదానికి తలుపు లేదు. ప్రక్కన ఉన్న నీటి హౌస్‌కు నాచుపట్టడంతో కప్పలు, పురుగులు పెరిగాయి. సమీప పాఠశాలల విద్యార్థులు, భవన నిర్మాణ కూలీలు ఆ నీటినే వినియోగిస్తున్నారు. శంకర్‌గంజ్‌లో ఉన్న మరుడుదొడ్ల తలుపులకు రంధ్రాలు పడ్డాయి. పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పురపాలిక పారిశుద్ధ్య పర్యవేక్షకుడు ఉమామహేశ్వర్ రెడ్డి తెలిపారు.

పట్టించుకోవడం లేదు..



శ్రీకృష్ణనగర్‌లో నిరుపయోగంగా..

అమరచింత, న్యూస్‌టుడే : ఆత్మకూరులో ఒక్కో సామూహిక మరుగుదొడ్డిని రూ.7.50 లక్షలతో నిర్మించారు. పురపాలక సంఘం కార్యాలయం వద్ద, ఆజాద్‌నగర్‌లో వాటిచుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయి. గాంధీ కూడలిలో దుర్వాసన వస్తోంది. జీఎస్ నగర్‌లో అపరిశుభ్రత వల్ల స్థానికులు ఇబ్బందులకు గురవతున్నారు. శ్రీకృష్ణనగర్‌లో ఏడాదిగా మరమ్మతులను పట్టించుకోవడం లేదు. స్థానికులు బహిరంగ మల విసర్జన చేస్తున్నారు. పుర కమిషనర్ నూరుల్ నజీబ్‌ను వివరణ కోరగా ప్రత్యేకంగా పారిశుద్ధ్య పనులు చేయిస్తామని, సమస్య ఉన్నచోట మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తామన్నారు.

సిబ్బందిని నియమించాలి


ఆత్మకూరులో నిర్వహణ లేని సామూహిక మరుగుదొడ్లు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : పట్టణంలోని సామూహిక మరుగుదొడ్ల నిర్వాహణ అధ్వానంగా మారింది. పరమేశ్వరస్వామి చెరువు అలుగుతో పాటు సంజయ్ కాలనీల్లో వినియోగంలో స్థానికులు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. నీటి సరఫరాను నియంత్రించడం, మూత్రశాలలు, మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించాల్సి ఉంది. జన సంచారం ఎక్కువగా ఉండే గాంధీచౌక్, అంబేడ్కర్ చౌరస్తా, సంతబజారు పరిసరాల్లో ఇతర గ్రామాల నుంచి వచ్చే వారి కోసం మూత్రశాలలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజా మరుగుదొడ్లు ఎక్కడ?


సుభాష్ చౌరస్తాలో మూసివేత

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద, సుభాష్ చౌరస్తా వెనుక వైపు నిర్మించిన ప్రజా మరుగుదొడ్లు మరమ్మతులు చేయకుండా మూసివేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ అవసరాల కోసం పట్టణానికి వచ్చే వారు, రోగులు, వారి సహాయకులకు అవస్థలు తప్పడం లేదు. పుర అధ్యక్షురాలు కరుణశ్రీని వివరణ కోరగా రహదారి విస్తరణలో భాగంగా సుభాష్ చౌరస్తా వద్ద ప్రజా మరుగుదొడ్లు నిర్మించాలని ప్రతిపాదనలు పెట్టామని తెలిపారు. గుత్తేదారుతో మాట్లాడి పీహెచ్‌సీ వద్ద మరమ్మతులు చేయిస్తామన్నారు.

కష్టపడి చదివి.. ఉపకులపతి స్థాయికి ఎదిగి

పీయూ వీసీగా డా.జీఎన్ శ్రీనివాస్ ● నేడు బాధ్యతల స్వీకరణ



పాలమూరు, న్యూస్‌టుడే: పాలమూరు విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా రానున్న జీఎన్ శ్రీనివాస్ సాధారణ రైతు కుటుంబంలో పుట్టి.. అంచెలంచెలుగా ఎదిగారు. చిన్నప్పటి నుంచి చదువుపై ఆసక్తితో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివారు. బీటెక్ పూర్తయిన తర్వాత ఓ ఇంజినీరింగ్ కళాశాలలో పార్ట్‌టైంగా ఉద్యోగం చేస్తూ మరోవైపు సాయంత్రం కళాశాలలో ఎంటెక్ పూర్తి చేశారు. అనంతరం అంచెలంచలుగా ఎదిగి ఉపకులపతి స్థాయికి చేరారు.

159 మందిలో..: పీయూకి మే 21 నుంచి రెగ్యులర్ ఉప కులపతి లేరు. ఈ పోస్టు కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాల నుంచి అర్హత కలిగిన 159 మంది దరఖాస్తు చేసుకోగా చివరికి శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ పోస్టుకు డిమాండ్ పెరిగింది. కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్ల నిధులు మంజూరు చేసిన తర్వాత ఇక్కడ ఉపకులపతి పోస్టుపై అనేక మంది ఆసక్తి చూపారు. అందులో ప్రభుత్వం అనుభవం కలిగిన ఆచార్యుడికి బాధ్యతలను అప్పగించింది.

కుటుంబ నేపథ్యం: శ్రీనివాస్ స్వస్థలం కరీంనగర్ జిల్లా గంభీరావ్‌పేట మండలం కొత్తపల్లి. తల్లిదండ్రులు నర్సయ్య, ఎల్లవ్వ వ్యవసాయం చేసేవారు. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు గంభీరావ్‌పేట ప్రభుత్వ పాఠశాలలోనే చదివారు. కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. 1991లో ఎంసెట్ ద్వారా మంచి ర్యాంకు సాధించి జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్ విద్యలో ఈఈఈ విభాగంలో చేరారు. 1995లో బీటెక్ పూర్తయిన తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ కళాశాలలో పార్ట్‌టైం కింద అధ్యాపకులుగా చేరారు. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు సాయంత్రం కళాశాల ద్వారా ఎంటెక్ పూర్తి చేశారు. 1997 వరకు సహాయాచార్యులుగా పని చేశారు. 2003లో అనంతపురం జేఎన్‌టీయూలో రెగ్యులర్ పోస్టు కింద అసోసియేట్ ఆచార్యులుగా విధుల్లో చేరారు. 2006లో జేఎన్‌టీయూ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. అక్కడే పని చేస్తూ 2011లో ఆచార్యులుగా పదోన్నతి పొందారు. 2022లో సీనియర్ ఆచార్యులుగా అర్హత లభించింది. నాటి నుంచి నేటి వరకు అక్కడ పని చేస్తున్నారు. వైస్ ప్రిన్సిపల్‌గా, ప్రిన్సిపల్‌గా, పలు కళాశాలలకు మెంటార్‌గా, పరిశోధన కమిటీ ఛైర్మన్‌గా, పలు పోటీ పరీక్షలకు సభ్యుడిగా, వసతి గృహ మేనేజర్‌గా సేవలు అందించారు.

కొత్త వీసీకి సవాళ్లెన్నో..

పీయూలో పలు సవాళ్లు కొత్త ఉపకులపతికి ఎదురు కానున్నాయి. విశ్వవిద్యాలయం సిబ్బందిపై పూర్తి అజమాయిషీ కరవైంది. కొందరు విధులకు వచ్చినట్లు హాజరు వేయించుకుని బయటకు వెళ్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. తరగతులపై పర్యవేక్షణ, అధ్యాపకుల అజమాయిషీని పకడ్బందీగా చేయాల్సి ఉంటుంది. లా కళాశాలకు గతేడాది అనుమతి వచ్చినా ఇప్పటి వరకు భవన నిర్మాణం పూర్తి కాలేదు. బాలికల వసతిగృహంలో ప్రస్తుతం ఒక గదిలో 8 మంది ఉంటున్నారు. ఒక గదిలో నలుగురు మాత్రమే ఉండాలి. మరో భవనం నిర్మించినా ఇంతవరకు ప్రారంభించలేదు. పర్యావరణ విద్యకు తరగతి గదుల్లేవు. కొల్లాపూర్, గద్వాల, వనపర్తి పీజీ కేంద్రాల్లో వసతి గృహాల సమస్యలను పరిష్కరించాల్సి ఉంది.

> ● పీయూకి ఉపకులపతిగా రావడం అదృష్టంగా భావిస్తున్నాను. నేడు వీసీగా బాధ్యతలు స్వీకరిస్తాను. 29 ఏళ్లుగా బోధనా రంగంలో పని చేస్తున్నాను. అన్ని విభాగాల్లో బాగా పని చేసిన అనుభవం ఉంది. అన్ని అంశాలపై సమగ్రమైన అవగాహన ఉంది. వర్సిటీ అభివృద్ధికి తనవంతు సేవలు అందిస్తాను.
>
> -జీఎన్ శ్రీనివాస్, పీయూ ఉపకులపతి

రూ.1.20 కోట్ల జరిమానా ఏమైనట్లు?

చౌడమ్మకుచ్చ మట్టి తరలించిన వారిపై చర్యలు తీసుకోని నాటి ఏడీ


చౌడమ్మకుచ్చ మట్టి పోసి చదును చేసిన వెంచర్ ఇదే

న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం : మహబూబ్‌నగర్ జిల్లాలో పనిచేస్తున్నప్పుడు బాలనగర్‌లోని ఓ రియల్ వెంచర్‌లో జరిగిన అక్రమాలను కప్పిపుచ్చారని, ప్రభుత్వానికి రూ.కోట్లల్లో నష్టం వాటిల్లిందని పేర్కొంటూ రాష్ట్ర గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్రమోహన్.. ప్రస్తుతం జనగామ జిల్లా ఏడీగా ఉన్న విజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేయటం కలకలం రేపింది. ఆరాతీస్తే ఆయన మహబూబ్‌నగర్ పట్టణం ఎదిర సమీపంలోని చౌడమ్మకుచ్చను అక్రమంగా తవ్వి భారీ మొత్తంలో మట్టి తరలించిన మట్టి మాఫియా, స్థిరాస్తి వ్యాపారిపైనా చర్యలు తీసుకోలేదని, వారి నుంచి జరిమానా వసూలు చేయకుండా ప్రభుత్వాదాయానికి భారీగా గండి కొట్టారని తెలిసింది. విచారిస్తే ఇలాంటివి చాలా వెలుగుచూసే అవకాశముంది.

60,375 టన్నుల మట్టి రవాణా : సరిగ్గా రెండేళ్ల క్రితం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం చుట్టూ మట్టి మాఫియా రెచ్చిపోయింది. కంటికి కనిపించిన గుట్టలన్నీ కరిగించేసింది. ఎలాంటి అనుమతులు లేకుండా ఎక్కడ పడితే అక్కడ గుట్టలను తవ్వి మట్టిని టిప్పర్లలో వెంచర్లకు, భవనాల పునాదులకు తరలించి రూ.కోట్లల్లో సొమ్ము చేసుకున్నారు. 2022 సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో ఎదిర శివారులో చౌడమ్మకుచ్చను మట్టి మాఫియా చెరబట్టింది. రెండు మాసాల పాటు రాత్రింబవళ్లు చౌడమ్మకుచ్చ నుంచి మట్టిని టిప్పర్లలో తిరుమల హిల్స్‌లో అప్పటి కీలక నేతకు బినామిగా చెలామణి అవుతున్న ఓ స్థిరాస్తి వ్యాపారి వెంచర్‌కు తరలించారు. ఈ వ్యవహారాన్ని గుర్తించిన ఎదిరవాసులు 'న్యూస్‌టుడే'కు సమాచారం ఇచ్చారు. క్షేత్రస్థాయి పరిశీలన చేసి 'రెచ్చిపోతున్న మట్టి మాఫియా' శీర్షికన 2022 అక్టోబర్ 9న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. అప్పటి మైనింగ్ శాఖ ఏడీ విజయ్‌కుమార్ స్పందించారు. మరుసటి రోజైన 10వ తేదీన తమ సిబ్బందితో వెళ్లి చౌడమ్మకుచ్చతో పాటు మట్టిని తరలించి పోసిన తిరుమల హిల్స్‌లోని వెంచర్‌ను కూడా పరిశీలించారు. నేలమట్టమైన చౌడమ్మకుచ్చను ఆశ్చర్యం వ్యక్తంచేసిన ఆయన ఎలాంటి అనుమతులు తీసుకోలేదని స్పష్టం చేశారు. చౌడమ్మకుచ్చ నుంచి తరలించిన మట్టికి పూర్తిస్థాయిలో అంచనాలు వేశారు. టిప్పర్లతో వెంచర్‌లో పోసిన మట్టి ఎత్తు 2.50 మీటర్లు, పొడవు 350 మీటర్లు, వెడల్పు 46 మీటర్లు ఉన్నట్లు కొలతలు వేసి గుర్తించి రికార్డు చేశారు. ఈ మట్టి దాదాపు 60,375 టన్నులు ఉంటుందని తెలిపారు. క్యుబిక్ మీటర్‌కు రూ.20 చొప్పున 10 రెట్ల జరిమానా విధిస్తామని, ప్రభుత్వానికి రూ.1,20,75,000 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ మొత్తం జరిమానాను మట్టి తరలింపునకు కారణమైన వ్యక్తులు, టిప్పర్ల యజమానులపై కేసులు నమోదు చేసి వసూలు చేస్తామన్నారు. నెల రోజులు దాటినా ఏడీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. చర్యలు తీసుకోకపోవడంపై మరోమారు 'న్యూస్‌టుడే' ఏడీ విజయ్‌కుమార్‌ను సంప్రదించగా రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదంటూ మైనింగ్ శాఖ నియమావళిని వివరించే ప్రయత్నం చేశారు.

కార్యాలయంలో కనిపించని దస్త్రాలు : చౌడమ్మకుచ్చ ద్వారా అక్రమంగా మట్టిని తరలించిన వ్యవహారంపై ప్రస్తుతం మైనింగ్ ఏడీ సంజయ్ కుమార్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా అలాంటి దస్త్రాలు, జరిమానా వసూలు చేసిన దాఖలాలు లేవని స్పష్టంచేశారు. చౌడమ్మకుచ్చ మట్టిని తరలించే పనిని జడ్చర్ల, అప్పన్నపల్లికి చెందిన కొందరు టిప్పర్ల యజమానులకు స్థిరాస్తి వ్యాపారి అప్పగించారు. ఒక్కో లోడుకు రూ.2,500 నుంచి రూ.3,000 వరకు ధర నిర్ణయించడంతో టిప్పర్ల యజమానులు రాత్రింబవళ్లు చౌడమ్మకుచ్చ నుంచి తిరుమల హిల్స్‌లో వెంచర్‌కు మట్టిని తరలించారు. ఈ వ్యవహారంలో నేతల ఆశీర్వాదంతో కేసులే కాదు.. జరిమానా కూడా చెల్లించకుండా టిప్పర్ల యజమానులు తప్పించుకోవటం గమనార్హం.

జూరాలకు కొనసాగుతున్న వరద

ధరూరు, న్యూస్‌టుడే: జూరాల జలాశయంలోకి వరద కొనసాగుతోంది. జలాశయంలోకి 71 వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు 11 గేట్లు, జలవిద్యుదుత్పత్తి ద్వారా మొత్తం కలిపి 83 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. కర్ణాటకలోని ఆల్మట్టి జలాశయంలోకి 45వేల క్యూసెక్కుల చేరుతుండగా దిగువకు 44వేలు వదులుతున్నారు. నారాయణ్‌పూర్ జలాశయంలోకి 51 వేలు చేరుతుండగా దిగువకు 45 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. మరో రెండు రోజుల పాటు జూరాలకు వరద నిలకడగా కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

కాంగ్రెస్‌ది ప్రజాపాలన ప్రభుత్వం

మంత్రి పొన్నం ప్రభాకర్


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, వేదికపై నీలి శ్రీనివాసులు, సంపత్‌కుమార్, సరిత తదితరులు

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: తెలంగాణలో నిరంకుశత్వం, నియంతృత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం గద్వాలలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణతో పాటు కృష్ణవేణి చౌక్‌లో ఏర్పాటుచేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నీలి శ్రీనివాసులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు కలెక్టరేట్ కార్యాలయం నుంచి కృష్ణవేణి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.2లక్షలపైన ఉన్న రైతులకు రూ.2 లక్షల వరకు మాఫీ చేయాల్సి ఉందని అది కూడా చేస్తామన్నారు. ఐదేళ్లలో రూ.లక్ష మాఫీ చేయని వాళ్లకు రుణమాఫీ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. త్వరలోనే నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు ప్రకటిస్తామని వివరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలదేనని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు జిల్లా వారే కావడంతో ఇక్కడి రైతులను దృష్టిలో ఉంచుకుని జూరాల, నెట్టెంపాడు, తుమ్మిళ్ల, గట్టు ఎత్తిపోతల పథకాలు పూర్తిచేస్తారన్నారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సరితలు మాట్లాడుతూ ఒక బీసీ బిడ్డ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా ఎన్నిక కావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రియాజ్, పుర ఛైర్మన్ బీఎస్ కేశవ్, టీపీసీసీ సభ్యుడు శంకర్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు నల్లారెడ్డి, నాయకులు ఇసాక్, షెక్షావలి, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గైర్హాజరు..: ప్రమాణ స్వీకార కార్యక్రమానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గైర్హాజరవటం చర్చనీయాంశంగా మారింది. కాగా ఎమ్మెల్యేతో పాటు మరో ఇద్దరు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు హాజరు కావాల్సి ఉండగా వారు రాకపోవడంపైనా చర్చించుకోవడం కన్పించింది.

వృత్తివిద్య కోర్సుల్లో తక్షణ ప్రవేశాలు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు వృత్తివిద్య కోర్సుల్లో తక్షణ ప్రవేశాలకు చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్ అన్నారు. ఆధునిక వృత్తివిద్య కోర్సుల్లో ప్రవేశాలకు శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర లేబర్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ అండ్ ఫ్యాక్టరీ ప్రిన్సిపల్ కార్యదర్శి సంజయ్‌కుమార్ జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ కేంద్ర భవన నిర్మాణం పూర్తికానందున కొత్త కోర్సులను ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేశామన్నారు. భవనం నిర్మాణం పూర్తయ్యాక కేంద్రాన్ని మారుస్తామన్నారు. కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా భరోసా కేంద్రం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: పోక్సో, అత్యాచార కేసుల్లో ఉన్న బాధితులకు అన్ని రకాలుగా భరోసా కేంద్రం అండగా ఉంటుందని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. కేంద్ర సిబ్బంది బాధితుల నివాసాలను సందర్శించి ఆర్థికంగా వెనకబడిన కుటుంబాలకు భరోసా కేంద్రం ద్వారా రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు తక్షణ సాయం కింద పరిహారమివ్వడం జరుగుతుందన్నారు. శుక్రవారం జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన బాధితురాలికి ఓ కళాశాల వసతిగృహంలో ఫీజు చెల్లించేందుకు రూ.5 వేలు సాయం చేశామని పేర్కొన్నారు.

విద్యుదుత్పత్తికి 38,043 క్యూసెక్కులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల ప్రాజెక్టుకు వరదనీటి ఉద్ధృతి కొనసాగుతోంది. ప్రాజెక్టుకు 75 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా విద్యుదుత్పత్తికి 38,043 క్యూసెక్కుల వరదనీటి విడుదల చేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 4.305, దిగువన ఆరు యూనిట్ల ద్వారా 4.345 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగిందన్నారు. ప్రస్తుత వర్షాకాలం ఎగువన 281.729, దిగువన 261.501 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని సాధించగలిగామని జెన్‌కో ఎస్‌ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

ఎరువు.. ఇక కాదు బరువు

మరో నోడల్ ఏజెన్సీగా ఆగ్రోస్



ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం

గద్వాల, న్యూస్‌టుడే: రైతులకు ఎరువులను మరింత చేరువ చేయడానికి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. ఎరువుల సరఫరా కోసం ప్రస్తుతం ప్రభుత్వ నోడల్ ఏజెన్సీగా మార్క్‌ఫెడ్ మాత్రమే వ్యవహరిస్తోంది. అన్ని ప్రాంతాలకు ఎరువుల సరఫరా సవ్యంగా జరగాలంటే మరో సంస్థకు కూడా బాధ్యతలు ఉండాలని ఆలోచించి వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఆగ్రోస్)ను మరో నోడల్ ఏజెన్సీగా ప్రభుత్వం ఎంపిక చేసింది. వచ్చే యాసంగి సీజన్ నుంచి ఆగ్రోస్ నేరుగా కంపెనీల నుంచి ఎరువులు తీసుకొచ్చి రైతులకు తమ కేంద్రాల ద్వారా విక్రయించనుంది.

నిరుద్యోగ పట్టభద్రులకు అవకాశం: రెండు దశాబ్దాల కిందట ఆగ్రోస్ ద్వారా వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన ఆధునిక యంత్రాలను పరికరాలను రైతులకు రాయితీపై ప్రభుత్వం అందజేసింది. ఇందు కోసం అప్పట్లో జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా ప్రాంతీయ కార్యాలయాలు ఉండేవి. నిధుల కొరతతో అవి ప్రాభవం కోల్పోయి చివరికి మూతపడ్డాయి. సిబ్బందిని రాష్ట్ర స్థాయి కార్యాలయంలో ప్రభుత్వం సర్దుబాటు చేసింది. ప్రస్తుతం అంపశయ్యపై ఉన్న ఈ సంస్థ ప్రాణాన్ని నిలబెట్టాలని సర్కారు యోచిస్తోంది. ఇప్పటికే ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను ప్రతి మండలంలో ఒకటి లేదా రెండు ఏర్పాటుకు అవకాశం కల్పించారు. నిరుద్యోగ పట్టభద్రులు వీటిని నిర్వహించేందుకు అనుమతించింది. ప్రస్తుతం వీటి ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల విక్రయాలు జరుగుతున్నాయి.

రైతులకు మేలు: మార్క్‌ఫెడ్ ద్వారానే కాకుండా ఆగ్రోస్‌తో ఎరువులను సరఫరా చేయాలని ప్రభుత్వం భావిస్తుండటం వల్ల రైతులకు మేలు జరగనుంది. తద్వారా ప్రతి గ్రామానికి సకాలంలో ఎరువులు అందనున్నాయి. అయితే ఇందుకు తగిన విధంగా ఆగ్రోస్ ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. పెద్ద ఎత్తున ఎరువుల నిల్వల కోసం గోదాములు సమకూర్చుకోవాలి. ఆగ్రోస్ ద్వారా ఎరువుల సరఫరా చేపడితే రైతులకు దూరాభారం తగ్గుతుంది. దీనివల్ల ఖర్చు సైతం ఆదా అవుతుంది. సరఫరా కేంద్రాల సంఖ్య పెరగటం వల్ల వానాకాలం యాసంగి సీజన్లలో అన్నదాతలకు సకాలంలో ఎరువులు అందుతాయని జోగులాంబ జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్ అంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

- సహకార సంఘాలు: 82
- సాగు విస్తీర్ణం: 18.50 లక్షల ఎకరాలు
- ఎరువుల వినియోగం: 3.94 లక్షల మెట్రిక్ టన్నులు

గ్రూప్-3 పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహించే గ్రూప్-3 పరీక్షలకు జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి వీడియోకాన్ఫరెన్స్‌లో పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 8,664 మంది అభ్యర్థులు 31 కేంద్రాల్లో పరీక్షలు రాసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో టీఎస్‌పీఎస్సీ రీజినల్ సమన్వయకర్త రామ్‌నరేష్ యాదవ్, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి దసరా బొనాంజా

16 రోజుల్లో రూ.39.22 కోట్ల ఆదాయం



ఆర్టీసీ ఆదాయ వివరాలు వెల్లడిస్తున్న ఆర్ఎం వి.శ్రీదేవి

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్టీసీకి దసరా పండగ సందర్భంగా ఆశించిన స్థాయిలో ఆదాయం వచ్చినట్లు ఆర్ఎం వి.శ్రీదేవి వెల్లడించారు. శుక్రవారం ఆమె తన ఛాంబర్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 16 రోజుల పాటు ఆర్టీసీకి వివిధ డిపోల వారిగా ప్రయాణికుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని వివరించారు. అక్టోబర్ 1 నుంచి 16 వరకు ఉమ్మడి జిల్లా (రీజియన్) వ్యాప్తంగా 740 బస్సులను వివిధ రూట్లలో 52.72 లక్షల కిలోమీటర్లు నడిపి 69.83 లక్షల మంది ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా ఆర్టీసీ సంస్థకు రూ.39.22 కోట్ల రాబడి వచ్చిందని ఆర్ఎం తెలిపారు. ఇందులో రూ.4.73 కోట్లు టోల్‌ప్లాజా, సెస్, ఇతర వస్తువుల రవాణా ద్వారా, మరో రూ.34.49 కోట్లు ప్రయాణికుల ద్వారా సమకూరిందని వివరించారు. ఈ ఆదాయం ఆర్టీసీకి రీజియన్ లోనే సరికొత్త రికార్డు అన్నారు. 14వ తేదీ ఒక్క రోజే 138 శాతం ఆక్యుపెన్సీతో రీజియన్‌లో ఆర్టీసీకి రూ.3.33 కోట్ల ఆదాయం వచ్చిందని, ఇది కూడా ఆర్టీసీ చరిత్రలో ఆల్‌టైం రికార్డు అన్నారు. పండగ సందర్భంగా రాష్ట్ర స్థాయిలోనూ మహబూబ్‌నగర్ రీజియన్ 110 శాతం ఆక్యుపెన్సీ సాధించి అగ్రస్థానంలో నిలిచిందని ఆర్ఎం తెలిపారు.

వివిధ డిపోల వారిగా వచ్చిన ఆదాయం ఇలా

డిపో పేరు	కి.మీలు (లక్షల్లో)	ఆదాయం (రూ.లక్షల్లో)
అచ్చంపేట	4.92	315.88
గద్వాల	6.26	415.04
కల్వకుర్తి	6.16	388.36
కొల్లాపూర్	4.21	265.27
కోస్గి	0.73	42.44
మహబూబ్‌నగర్	8.00	519.55
నాగర్‌కర్నూల్	5.06	353.98
నారాయణపేట	5.54	347.10
షాద్‌నగర్	4.83	316.55
వనపర్తి	7.01	485.28
మొత్తం	52.72	3449.45

అండర్-23 ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక



అండర్-23 ఉమ్మడి జిల్లా పోటీలకు ఎంపికైన క్రికెట్ జట్లతో ఎండీసీఏ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఈనెల 21వ తేదీ నుంచి జరిగే ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ పోటీలకు జిల్లా క్రికెట్ సంఘం శుక్రవారం ఆరు జట్లను ఎంపిక చేసింది. 28వ తేదీ వరకు ఈ ఆరు జట్ల మధ్య క్రికెట్ పోటీలు ఉంటాయని, ఈ పోటీల్లో ప్రతిభా చాటిన క్రీడాకారులను గుర్తించి ఉమ్మడి జిల్లా అండర్-23 జట్టును ఎంపిక చేస్తామని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి ఎం.రాజశేఖర్ తెలిపారు. నవంబర్ 4 నుంచి వరంగల్, సంగారెడ్డి జిల్లా కేంద్రాల్లో హెచ్‌సీఏ (హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్) ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ఉంటాయని, ఈ పోటీల్లో ప్రతిభ చాటిన వారిని రంజీ జట్టుకు ఎంపిక చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం ఉపాధ్యక్షులు సురేష్, అశోక్, కోచ్ అబ్దుల్లా పాల్గొన్నారు.

వేడుక మాటున వేదన



న్యూస్‌టుడే- కోస్గి, పాతబస్టాండ్(నారాయణపేట)

డీజే శబ్దాలు మరణ శాసనాలుగా మారుతున్నాయి. అతి భయంకర ధ్వనులు చెవులను దెబ్బతీస్తున్నాయి. పలువురు యువకులు వాటి ముందు ఎక్కువ సమయం నృత్యాలు చేయడంతో చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. చిన్నా, పెద్ద తేడా లేకుండ డీజేల పట్ల ఆకర్షితులవుతున్నారు. శ్రుతిమించిన ధ్వనులే ఇబ్బందుల పాల్జేస్తున్నాయి.



నారాయణపేటలో డీజే శబ్దాల మధ్య నృత్యాలు చేస్తున్న యువకులు

● వనపర్తి జిల్లా అమరచింత మండలం మిట్టనందిమల్ల గ్రామంలో 28 ఏళ్ల యువకుడు దసరా ఉత్సవాల శోభాయాత్రలో డీజే శబ్దాల మధ్య నృత్యాలు చేశాడు. ఇంటికి వచ్చి గుండెపోటుకు గురై మృతి చెందాడు.

● **ధరూర్:** రేవులపల్లిలో ఇటీవల డీజే శబ్దాల మధ్య బతుకమ్మలను ఊరేగిస్తుండగా సౌండ్ తగ్గించాలని ఓ వ్యక్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. అతనితో ఊరేగింపు నిర్వాహకులు గొడవపడ్డారు. వారించడానికి వచ్చిన ఆర్మీ జవాన్‌ను కత్తితో పొడిచారు.

మీకు తెలుసా..?

● మహారాష్ట్రలోని గాంధీ చౌక్ వద్ద జరిగిన ఓ ఉత్సవంలో ఎక్కువ సంఖ్యలో డీజేలను ఏర్పాటు చేశారు. వాటి శబ్ద ప్రభావంతో 250 మంది చెవిపోటుకు లోనయ్యారు. వీరిలో చాలా మందికి చెవుడు వచ్చింది.

చెవులు చిల్లులు

బ్లూటూత్, రిమోట్ వంటి పరికరాలతో డీజేలను నియంత్రించే పద్ధతి రావడంతో శబ్ద కాలుష్యంతోపాటు రేడియేషన్ ప్రభావం ఉంటోంది. మానసిక సమస్యలు, వ్యాకులత కూడా కలుగుతున్నాయి.

శబ్ద తీవ్రతను డెసిబుల్స్‌లో కొలుస్తారు. డెబ్బై డెసిబుల్స్ తీవ్రత ఉన్న శబ్దాలను చెవులు తట్టుకోగలుగుతాయి. ఆపై పెరిగితే ప్రమాదం తప్పదు. 80 నుంచి 100 డెసిబుల్స్ మధ్య చెవుడు వచ్చే ప్రమాదం ఉంది. వంద నుంచి 120 డెసిబుల్స్ మధ్య రక్తపోటు పెరిగి గుండె లయ తప్పి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. మనుషులే కాదు పశుపక్ష్యాదులపై ధ్వని ప్రభావం చూపుతుంది.

మన జిల్లాలో వినాయక, బతుకమ్మ, దుర్గామాత ఉత్సవాల్లో సౌండ్‌బాక్స్‌లను పెద్దఎత్తున వినియోగిస్తున్నారు. పల్లెల్లోనూ కొంతమంది డీజేలను కొనుగోలు చేసి అద్దెలకు ఇస్తున్నారు. ప్రాంతం బట్టి, ఉపకరణం స్థాయిని అనుసరించి రూ. 20 నుంచి రూ. 80 వేలు వరకు వసూలు చేస్తున్నారు.

మనం ఏం చేయాలి?

● చిన్న శబ్దంతో డీజేలు వాడుకుంటే ఇబ్బంది ఉండదన్న విషయాన్ని యువతకు అవగాహన కల్పించాలి.

● చిన్న పిల్లలు, వృద్ధులు, వ్యాధిగ్రస్తులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మన సరదా కోసం ఎదుటివారి జీవన హక్కును దెబ్బతీసినట్లేనని గుర్తించాలి. అర్ధరాత్రి మోతమోగిస్తే ఎక్కువమందికి నిద్రా భంగం కలుగుతుంది.



● ఉమ్మడి జిల్లాలో పోలీసులు డీజే శబ్దాలపై ప్రకటనలు చేస్తున్నా, వాస్తవానికి పట్టించుకోలేదు. కొన్ని చోట్లయితే ఎవరైతే ఫిర్యాదు చేస్తారో వారిపేరును నిర్వాహకులకు చెప్పిన సందర్భాలు ఉన్నాయి.

నిబంధన అమల్లో ఉంది



హైదరాబాద్ వంటి ప్రధాన నగరాల్లో డీజేలపై నిషేధం ఇప్పటికే అమల్లో ఉంది. పోలీసులు ఎంతచెప్పినా పౌరసమాజం, ప్రజాసంఘాలు కలిగించుకుంటే తప్ప సమస్య పరిష్కారం కాదు. డీజేల నిర్వాహకులతో కమిటీ ఏర్పాటు చేసి శబ్దకాలుష్యం వల్ల అనర్థాలపై అవగాహన కల్పిస్తాం. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.

- నల్లపు లింగయ్య, డీఎస్పీ, నారాయణపేట

చెవుడు వచ్చే ప్రమాదం



ఎక్కువ శబ్దం, ఎక్కువ సేపు వింటే తరంగాలు చెవుల్లో మోత మోగించడంతోపాటు కర్ణభేరి దెబ్బతింటుంది. వినికిడి సమస్యలు తలెత్తుతాయి. మానసిక ఒత్తిడి, వ్యాకులత పెరుగుతుంది. ఇది మానసిక సమస్యలకు దారితీస్తుంది. చెవుడు వంటి సమస్యలతో పాటు, గుండె పోటుకు ఆస్కారం ఉంటుంది. హృదయ సమస్యలు ఉన్నవారు ఎక్కువ శబ్దాలను వినలేరు. వారిని దృష్టిలో ఉంచుకోవాలి. మెదడు దెబ్బతినే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వీలైనంత వరకు తక్కువ శబ్దాలతో, ప్రశాంతమైన వాతావరణంలో వేడుకలు చేస్తే మంచిది.

- డా.శ్రీనివాస్, ఈఎన్‌టీ వైద్యుడు.

292 సెక్షన్ బీఎన్ఎస్ కింద శిక్షార్హులు



పరిమితికి మించిన శబ్దకాలుష్యంతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సెక్షన్ 292 బీఎన్ఎస్ కింద శిక్షార్హులవుతారు. వాణిజ్య ప్రాంతాలు, జనసంచారం ఉండే నివేశాల్లో ఉదయం, రాత్రి వేళల్లో నిబంధనలకు లోబడి శబ్దం ఉండాలి. పరిమితికి మించి శబ్దం పెంచితే రూ.200 నుంచి రూ.2వేల వరకు కోర్టు జరిమానా విధించే అవకాశం ఉంది. ప్రజాజీవనానికి భంగం కల్గిస్తే మరికొన్ని తీవ్ర శిక్షలు, సెక్షన్లు వర్తిస్తాయి.

- కె.రాజశేఖర్, న్యాయవాది నారాయణపేట

చెల్లియో చెల్లక

న్యూస్‌టుడే- ఊట్కూరు, పాలమూరు



ఉమ్మడి పాలమూరు జిల్లాలో పదిరూపాయల నాణేలు తీసుకోవడం లేదనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో బ్యాంకర్లు ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ● ప్రయాణికులు ఇచ్చే రూ. 10 నాణేలను తీసుకోవాలని ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లను ఆ సంస్థ యాజమాన్యం ఆదేశించింది. ఫిర్యాదు నేపథ్యంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కార్యదర్శి గత నెల 29న ఆయా డిపో మేనేజర్లకు ఆదేశాలను జారీ చేశారు. ● మక్తల్ పట్టణంలోని కొన్ని పెట్రోలు బంకుల్లో కూడా రూ. 10, రూ.20 నాణేలను తీసుకోవటం లేదని విని యోగదారులు వాపోతున్నారు. అవగాహన రాహిత్యం వల్ల కొంత మంది ప్రజలు కూడా తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు.



మహబూబ్‌నగర్‌లో దుకాణదారులకు రూ.10 నాణెంపై అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

అసలేం జరిగింది

పెద్దనోట్ల రద్దు నిర్ణయం తీసుకున్న తర్వాత రూ.1000, రూ.500 రద్దు చేసి వాటి స్థానంలో కొత్త రూ.2వేలు, రూ.500 విడుదల చేశారు. పెద్దనోట్ల రద్దు అనంతరం ఎక్కువ మొత్తంలో చిల్లర సమస్య ఉత్పన్నమైంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు పది రూపాయాల నాణేన్ని చెలామణిలోకి తీసుకొచ్చారు. బ్యాంకు ఖాతాల నుంచి నగదు ఉపసంహరించినప్పుడు ఎక్కువ మొత్తంలో నాణేలను ఖాతాదారులకు ఇచ్చారు. ఈ బరువు మాకెందుకని చాలామంది బయట ఎవరూ తీసుకోవడం లేదనే వదంతులు లేపారు.

బ్యాంకుల్లో రూ.16 కోట్ల నాణేలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రూ. 16 కోట్ల విలువైన రూ.10 నాణేలు ఉన్నాయి. పలు ప్రైవేటు, అనుబంధ సంస్థల బ్యాంకులలో మరో రూ. 10 కోట్ల నాణేలు ఉన్నట్లు బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి. ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఎస్‌బీఐ బ్యాంకుల్లో రూ.2.5 కోట్ల రూ.10 నాణేలు, యూనియన్ బ్యాంక్‌లో రూ. 2కోట్లు నాణేలు ఉన్నట్లు ఆ వర్గాల సమాచారం.

అవగాహన విస్తృతం చేయాలి



మా దుకాణానికి సరకుల కోసం వచ్చే కొంత మందికి రూ. 10 నాణెం ఇస్తే తీసుకోవటం లేదు. ఎంత చెప్పినా ససేమిరా అంటున్నారు. కొంత మంది తీసుకెళ్లి, ఎవ్వరూ తమవద్ద తీసుకోకపోతే తిరిగి ఇస్తున్నారు. ప్రజల్లో అపోహలు తొలగిపోవాలంటే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలి. ఈ మధ్య ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు పెడుతున్నారు. అందులో ఈ విషయం చెప్పాలి. షీటీంలు, ఇతరశాఖల అవగాహన సదస్సుల్లో ఇదో అంశంగా చేస్తే బాగుంటుంది.

- ఎస్.మధుకర్, కిరాణా దుకాణదారుడు, ఊట్కూరు.

నిరాకరిస్తే ఫిర్యాదు చేయండి



దుకాణదారులైనా, వ్యాపార సంస్థలైనా , వ్యక్తులైనా రూ.10, రూ.20 నాణేలను తీసుకునేందుకు నిరాకరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఇలాంటి ఘటనలు ఎదురైనప్పుడు దగ్గరలోని పోలీసు స్టేషన్‌లోనో, లేదా ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చు. అందరం కలిసి అసత్య ప్రచారాలను ఆపుదాం.

- కాల్వ భాస్కర్, లీడ్ బ్యాంకు మేనేజర్, మహబూబ్‌నగర్.

'పాలమూరు'పై సీఎంకు చిత్తశుద్ధి ఏదీ?: నాగం



నాగర్‌కర్నూల్ : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి డా. నాగం జనార్దన్‌రెడ్డి

కందనూలు, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేసి నార్లపూర్, వట్టెం, కర్వెన జలాశయాలను నీటితో నింపాలని మాజీ మంత్రి డా. నాగం జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఆయన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై చిత్తశుద్ధి లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి దాదాపు 9 నెలలు దాటినా కొల్లాపూర్ మండలంలోని కుడికిళ్ల వద్ద పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించిన మూడున్నర కిలో మీటర్ల సొరంగం పనులు పూర్తి చేయలేదని విమర్శించారు. ప్రస్తుత వర్షాకాలం ముగిసే వరకు పనులు త్వరగా పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించాలన్నారు. లేని పక్షంలో డిసెంబర్ 9న కూడికిళ్ల వద్ద నిరసన దీక్ష చేపడుతామని హెచ్చరించారు. అకాల వర్షాలతో పత్తి సాగు నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. పంట నష్టపరిహార నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి పంపించాలన్నారు. సీసీఐ కేంద్రాలను ప్రారంభించి పత్తి కొనుగోలు చేయాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ, హైడ్రా పరిపాలన బందు చేసి ప్రజా పరిపాలనపై దృష్టి సారించాలన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టు పరిధిలోని కాల్వల ద్వారా 5 వేల క్యూసెక్కుల నీరు వెళ్లేలా వెడల్పు చేయాలన్నారు. జిల్లాలోని మంత్రి, ఎమ్మెల్యేలు స్పందించి పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ప్రాజెక్టు పరిధిలోని పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయించడానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు డా. నాగం శశిధర్‌రెడ్డి, అర్థం రవి, తిమ్మాజిపేట పాండు, బాలగౌడ్, ఐతోలు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు ప్రభావంతో రైతు మృతి

మల్దకల్, న్యూస్‌టుడే: పత్తి పొలానికి పురుగు మందు పిచికారీ చేసిన రైతు తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందిన ఘటన మల్దకల్‌లో చోటు చేసుకుంది. ఏఎస్సై ఈశ్వరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు మంగళి ఆంజనేయులు(46) గురువారం తన పత్తిపొలానికి క్రిమిసంహారక మందు పిచికారీ చేశాడు. దీంతో రాత్రి తీవ్ర అస్వస్థతకు గురికాగా కుటుంబ సభ్యులు చికిత్సకు కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో శుక్రవారం తెల్లవారు జామున మృతిచెందినట్లు తెలిపారు. ఆంజనేయులుకు భార్య సరస్వతి, ఇద్దరు పిల్లలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై వివరించారు.

బస్సు ఢీకొని ఒకరి దుర్మరణం



శైలేష్

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని వెన్నచర్ల, రాయిపాకుల దారిలో శుక్రవారం ఉదయం బస్సు, బైకు ఢీకొన్న ఘటనలో వెన్నచర్లకు చెందిన సంపంగి హన్మంతు చిన్నకుమారుడు సంపంగి శైలేష్ (18) మృతిచెందాడు. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. వెన్నచర్ల నుంచి ద్విచక్రవాహనంపై వెళ్తున్న శైలేష్ బండరాయిపాకుల సమీపంలో బస్సును అధిగమించబోయి ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన యువకుడిని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

పిడుగు పాటుకు కూలీ...



సంగమ్మ

మరికల్ కూడలి : పిడుగు పడి ఓ వ్యవసాయ కూలీ మృతి చెందిన సంఘటన మరికల్ మండలం కన్మనూర్ గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. మరో ఇద్దరు మహిళలు అస్వస్థతకు గురయ్యారు. గ్రామస్థుల కథనం ప్రకారం... శెర్నపల్లి గ్రామానికి చెందిన రైతు కన్మనూర్ శివారులో కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాడు. కర్నాటక రాష్ట్రంలోని గురిమిట్కల్ తాలుకా పరిధిలోని అన్వార్ గ్రామానికి చెందిన మహిళలను పత్తి తీసేందుకు శుక్రవారం తీసుకొచ్చాడు. మధ్యాహ్నం వర్షం పడడంతో వారు ఓ చెట్టు కిందకు చేరారు. ఆ సమయంలో పిడుగు పడగా బోయ సంగమ్మ(45) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. మల్లమ్మ, అల్లమ్మ అనే మహిళలకు గాయాలై అస్వస్థతకు గురయ్యారు. అయితే పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే కూలీలను తీసుకొచ్చిన వాహనంలోనే మృతదేహం, గాయపడిన వారిని తరలించారు.

బాలిక హత్య కేసులో ఇద్దరికి జీవితఖైదు

సదాశివపేట: బాలిక హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదుతోపాటు రూ.500 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ సెషన్ జడ్జి జి.భవానీచంద్ర శుక్రవారం తీర్పు ఇచ్చారు. సదాశివపేట సీఐ మహేష్‌గౌడ్ తెలిపిన ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం ఇబ్రహింపల్లికి చెందిన వీరేశం భార్య కల్పన మూడేళ్ల కూతురు భవ్యతో కలిసి గతంలో ప్రసవానికి షాబాద్ మండలం బోడపహాడ్ పుట్టింటికి వెళ్లింది. అక్కడ రాజుతో పరిచయం ఏర్పడి అక్కడే ఉండిపోయింది. కాన్పు అనంతరం చిన్నకూతురు, పెద్ద కూతురు భవ్య, ప్రియుడితో కలిసి సదాశివపేట పట్టణం ప్రియదర్శిని కాలనీకి మకాం మార్చారు. భవ్య తనను నాన్న అని పిలవడంలేదని రాజు ఆగ్రహంతో చిన్నారిని గోడకు కొట్టడంతో మృతి చెందింది. ఈ ఘటన 26 ఫిబ్రవరి 2019లో జరిగింది. ఈ విషయం తండ్రి వీరేశానికి తెలియడంతో కూతురు మరణంపై అనుమానం ఉందని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ.. కల్పన, రాజుపై కేసు నమోదు చేసి విచారించగా, నిందితులు నేరం అంగీకరించడంతో వారిని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం కేసు విచారణకు వచ్చింది. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు ఇచ్చారని వివరించారు.

పీయూలో సౌత్‌జోన్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

పాలమూరు, న్యూస్‌టుడే: పాలమూరు విశ్వవిద్యాలయంలో సౌత్‌జోన్ పోటీల కోసం ఎంపికలను నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పీయూలో బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను పురుషుల విభాగంలో నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రీరాములు (కొల్లాపూర్), జగదీశ్ (నారాయణపేట), బడేసాబ్ (మహబూబ్‌నగర్), శివకృష్ణ (నారాయణపేట), రాకేశ్ (మహబూబ్‌నగర్) తదితర క్రీడాకారులను ఎంపిక చేసినట్లు పీడీ శ్రీనివాసులు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వ విద్యాలయంలో నిర్వహించే సౌత్ జోన్ క్రీడల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. పీడీలు సత్య భాస్కర్, వెంకట్‌రెడ్డి, శారద, నరేశ్, మన్యం పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

రాయచోటి, సుండుపల్లి, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలం పెద్దినేనికాలువ గ్రామం బెస్తపల్లిలో నివాసం ఉన్న వివాహిత లక్ష్మి(25) శుక్రవారం ఇంటిలో పెట్రోలు పోసుకుని నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఘటనలో తీవ్ర గాయాలైన ఆమెను 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన లక్ష్మి పరిస్థితి విషమంగా ఉండడంతో సమాచారం అందుకున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి అసిఫా సుల్తానా ఆసుపత్రికి వచ్చి వాంగ్మూలం తీసుకున్నారు. ఎస్సై శ్రీనివాసులు విచారించి కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. మహబూబ్‌నగర్‌కు చెందిన గోవిందు. లక్ష్మిల దంపతులు రెండేళ్ల క్రితం జీవనోపాధి నిమిత్తం ఇక్కడికి వచ్చారు. సుండుపల్లి మండల పరిధిలోని రాళ్లుకొట్టే పనులు చేస్తూ బెస్తపల్లెలో అద్దె ఇంటిలో నివాసముంటున్నారు. వీరికి మూడేళ్లు, పదినెలల వయసున్న ఇద్దరు ఆడపిల్లలున్నారు. ఘటన గురించి తెలుసుకున్న రాయచోటి గ్రామీణ సీఐ వరప్రసాద్, సుండుపల్లి ఎస్సై శ్రీనివాసులు ఆసుపత్రికి వెళ్లి విచారించారు. లక్ష్మిపరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120-00
రిటైల్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

క్రీడాకారుల్లో నైపుణ్యం వెలికితీతకే సీఎం కప్



సీఎం కప్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు సీఎం కప్ మంచి వేదిక అని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం సీఎం కప్ టార్చ్ ర్యాలీకి కలెక్టర్ స్వాగతం పలికారు. పట్టణంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణ నుంచి లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ కొనసాగింది. ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్‌తో పాటు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడాకారులను తయారు చేయాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యువత క్రీడా సాధనతో శారీరకంగా దృఢంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి సీతారాం తదితరులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

శ్రీనివాస: **దేవర,** వెంకటేశ్వర: **విశ్వం,** శ్రీరామా: **వేట్టయన్**

– న్యూస్‌టుడే, వనపర్తి న్యూటౌన్



మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : సైబర్ మోసాల గురించి విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు. శుక్రవారం వనపర్తి బాలికల ఉన్నత పాఠశాలలో సైబర్ వారియర్ల నియామకంపై విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. సైబర్ వారియర్ కమిటీలో విద్యార్థులను భాగస్వామ్యం చేసి వారితో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ నాగభూషణ్ రావు, పట్టణ ఎస్సై జయన్న పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పుచ్చకాయపై రతన్ టాటా చిత్రం



వనపర్తి పట్టణం: పుచ్చకాయపై ప్రముఖ పారిశ్రామిక వేత్త రతన్ టాటా చిత్రం చెక్కి ఆయనపై ఉన్న అభిమానాన్ని ఓ ఉపాధ్యాయుడు చాటుకున్నారు. పట్టణానికి చెందిన సాయిచందర్ రెడ్డి పెద్దమందడి జడ్పీ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. సందర్భాన్ని బట్టి ఆయన చిత్రాలు వేస్తూ తన కళా ప్రతిభను చాటుతున్నారు. ఇటీవల మృతి చెందిన పారిశ్రామిక వేత్త రతన్ టాటా చిత్రాన్ని పుచ్చకాయపై చెక్కారు.

పోటీలతో విజ్ఞాన వికాసం



విజేత విద్యార్థులతో బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్ ప్రిన్సిపల్ సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలతో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయవచ్చని బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్, మాస్టర్ మైండ్స్ హైస్కూల్ ప్రిన్సిపల్స్ సంతోష్ కుమార్, గౌతమ్‌కుమార్ పేర్కొన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు 'అంతర్జాలం వినియోగం వల్ల కలిగే లాభనష్టాలు', 'విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశాలపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల మేధాసంపత్తి పెంపొందించుకోవచ్చని అన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈనాడులో ప్రచురితమయ్యే కథనాల్లో కచ్చితత్వం, విలువలు, ప్రమాణాలు, విశ్వసనీయత ఉంటుందన్నారు. యువత, విద్యార్థుల కోసం ఈతరం యువ ప్రతిభ లాంటి ప్రత్యేక పేజీలు అందిస్తోందని అన్నారు. బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్‌లో మొదటి మూడు స్థానాల్లో గోవింద్ (8వ తరగతి), ఆదిత్య (9వ), రూహి సుల్తానా (9వ తరగతి) నిలిచారు. మాస్టర్ మైండ్స్ హైస్కూల్‌లో మొదటి మూడు స్థానాల్లో అభినవ్ (8వ తరగతి), ఆకాశ్ (9వ), భవ్యశ్రీ (పదో తరగతి) నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్స్ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు దయానంద్, అశోక్, రాఘవేంద్ర, రమేశ్, శ్రీకాంత్, నరేశ్ గౌడ్ పాల్గొన్నారు.



పరీక్ష రాస్తున్న బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్ విద్యార్థులు





పరీక్ష రాస్తున్న మాస్టర్ మైండ్ పాఠశాల విద్యార్థులు.. విజేతలతో ప్రిన్సిపల్ గౌతమ్‌కుమార్, ఉపాధ్యాయులు

ఆలయాలను అభివృద్ధి చేస్తాం: మంత్రి



పూజలు నిర్వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు

అలంపూర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రజలకు సేవలు చేయడానికి అనుకూల పరిస్థితి కల్పించాలని, శక్తి ఇవ్వాలని జోగులాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామిని కోరినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆలయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహాయంతో ప్రణాళిక సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామన్నారు. ప్రజల సహకారంతో ఒక ట్రస్ట్ ఏర్పాటు చేసి జోగులాంబ అమ్మవారి సన్నిధిలో ఒక సత్రాన్ని నిర్మించేందుకు స్థలం సేకరించామని, త్వరలో శంకుస్థాపన చేసి నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని మంత్రి వివరించారు. అమ్మ వారి సన్నిధి నుంచి హారతి అనంతరం భక్తులు సులభంగా తిరిగి వెళ్లేందుకు అలంపూర్ చౌరస్తా వరకు ఆర్టీసీ బస్సులు ప్రతి రోజూ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకు పూర్వం మంత్రి దంపతులు కుటుంబ సమేతంగా ఆలయాలను దర్శించుకున్నారు. మంత్రి దంపతులకు ఈవో పురేందర్, ఆలయ ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి స్వాగతం పలికారు. కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాస్‌రావు, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, ఆర్డీవో రామచందర్ తదితరులున్నారు.

పరిసరాల శుభ్రత కీలకం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జయచంద్ర మోహన్

చిన్నంబావి, న్యూస్‌టుడే: ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్ సూచించారు. మండలంలోని అమ్మాయిపల్లిలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాలానుగుణ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉండటంతో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో రఘునాథ్ రెడ్డి, ఎంపీడీవో రమణారావు, ఎంపీవో రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సత్కారం

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : పట్టణానికి చెందిన సిరిచందన, శ్రీనిధి ఎంబీబీఎస్‌లో ఉచిత సీట్ సాధించడంతో శుక్రవారం జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు వామన్ గౌడ్, సీడీసీ మాజీ అధ్యక్షుడు చెన్నకేశవరెడ్డి సత్కరించారు. ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని భవిష్యత్‌లో పేదలకు సేవలందించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు విశ్వేశ్వర్, మేగారెడ్డి, బాలకృష్ణారెడ్డి, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిధుల వినియోగంపై కేంద్ర బృందం పరిశీలన



దస్త్రాలు పరిశీలిస్తున్న కేంద్ర పరిశీలకులు ప్రవీణ్ పాటిల్, పాండే, జిల్లా అధికారులు

అమరచింత, న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం గ్రామాభివృద్ధి కోసం విడుదల చేసిన నిధులు, పథకాల వినియోగంపై శుక్రవారం మండలంలోని ఈర్లదిన్నె గ్రామంలో కేంద్ర బృందం పరిశీలకులు ప్రవీణ్ పాటిల్, పాండే పరిశీలన చేశారు. ఉదయం గ్రామవీధుల్లో పర్యటించారు. గ్రామస్థులతో మాట్లాడి పలు విషయాలు నమోదు చేసుకున్నారు. పథకాల పనితీరు, వాటిలో లోపాలపై చర్చించారు. వచ్చిన నిధులు, చేసిన ఖర్చుకు సంబంధించి వివరాలు, ఫొటోలు తీసుకున్నారు. మహిళా సంఘంలోని సభ్యులు పొదుపు, బ్యాంకు రుణాలతో సాధించిన ఆర్థిక పురోగతిపై మహిళా సమాఖ్య సభ్యులతో చర్చించారు. కేంద్ర పరిశీలకులకు మాజీ ఎంపీపీ చుక్క మాలతి, సర్పంచి ఆశిరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఉమాదేవి, అసిస్టెంట్ డీఆర్‌డీఏ నాగేంద్రం, ఏపీడీ సుల్తాన్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంపీవో నర్సింహ్మయ్య, సమాఖ్య ఏపీవో శ్రీనివాసులు, ఈసీ రఘు పాల్గొన్నారు.

కర్ర.. ప్రమాదాన్ని నియంత్రించేనా



పట్టణంలోని బీసీ కాలనీలో లక్ష్మీ నర్సింహస్వామి ఆలయానికి వెళ్లే వీధిలో రహదారి వెంట విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. పలు చోట్ల కిందకు వేలాడుతున్నాయి. పాత బీసీ వసతిగృహం భవనం పక్కన విద్యుత్తు తీగలు ఓ ఇంటి గోడలకు తగిలేలా ఉండటంతో యజమాని కర్రతో తీగలు తగలకుండా చర్యలు తీసుకున్నారు. ఈ విషయంపై లైన్‌మెన్ జగదీశ్‌ను వివరణ కోరగా గుత్తేదారుతో మాట్లాడి వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు.

- న్యూస్‌టుడే, అమరచింత

బాగు చేయక.. బాధలు తీరక

శ్రీరంగాపురం నుంచి పుల్గర్‌చర్ల వెళ్లే దారి గుంతలమయంగా మారింది. వర్షాలు కురుస్తుండటంతో గుంతల్లో నీటి నిల్వతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒక వరుస దారిని రెండు వరుసలుగా మార్చాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై రహదారులు, భవనాల శాఖ ఏఈ హనుమంతును వివరణ కోరగా.. గుంతల మరమ్మతుల కోసం నిధులు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభించి సమస్య పరిష్కరిస్తామన్నారు.



-న్యూస్‌టుడే, శ్రీరంగాపురం

రహదారికి మరమ్మతులు చేయండి

పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టుకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి నుంచి న్యాయస్థానానికి ఉన్న పది ఫీట్ల రహదారి గుంతమయంగా మారింది. ఇటీవల రహదారి పక్కనే ఓ ప్రైవేట్ టెలిఫోన్ సంస్థ తవ్వకాలు చేపట్టింది. వర్షానికి రహదారి బురదమయంగా మారింది. భారీ వాహనాలు ఇరుకైన రహదారిలో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



- న్యూస్‌టుడే, ఆత్మకూరు

అలుగు కాలువ లేక అవస్థ

పట్టణంలోని తొమ్మిదో వార్డు హైటెక్ కాలనీలో మర్రికుంట చెరువు నీరు ఇళ్ల మధ్య ప్రవహిస్తోంది. చెరువు మరమ్మతుల్లో భాగంగా పాత అలుగు మూసి వేసి కొత్త అలుగు ఎక్కువ ఎత్తులో నిర్మించారు. చెరువు అలుగు పారినప్పుడు నీరు వెళ్లేందుకు కాలువ నిర్మించకపోవడంతో ఇళ్ల మధ్య చేరుతోంది. దోమల బెడద ఎక్కువైందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పుర కమిషనర్ పూర్ణచందర్ మాట్లాడుతూ కాలువ నిర్మాణానికి దాదాపు రూ.60 లక్షల వరకు ఖర్చు అవుతుందని పురపాలికలో నిధుల కొరత వల్ల పనులు చేపట్టలేదని, సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.



- న్యూస్‌టుడే, వనపర్తి పట్టణం

ఉమ్మడి జిల్లా వాలీబాల్ పోటీలకు ఎంపిక

వనపర్తిగ్రామీణం: వనపర్తిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా పోటీలకు చిట్యాల ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గణేష్‌కుమార్ తెలిపారు. విద్యార్థులు వేణుకుమార్, కార్తీక్, భవ్య ఈ నెల 19న మహబూబ్‌నగర్ జిల్లా మేములలో జరిగే ఉమ్మడి జిల్లా పోటీల్లో పాల్గొంటున్నారు.

ఆత్మకూరు, న్యూస్‌టుడే : వనపర్తిలో జరిగిన జిల్లా స్థాయి అండర్-14 వాలీబాల్ పోటీల్లో ఆత్మకూరు బాలికల జట్టు మొదటి బహుమతి సాధించింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో ఆత్మకూరు జాతర మైదానంలో శిక్షణ పొందుతున్న బాలికల జట్టు ప్రతిభ కనబరచింది. ఉమ్మడి జిల్లా బాలికల విభాగం వాలీబాల్ పోటీల్లో ఆత్మకూరు బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన కావ్య, చంద్రిక, పూజిత, సహస్ర, బిందు ప్రాతినిధ్యం వహించనున్నారని పీఈటీలు సంతోష, వెంకటేశ్వర్లు, శిక్షకుడు ఖాదర్ తెలిపారు.

చేపలతో మత్స్యకారులకు ఉపాధి



కొత్తకోట శంకరసముద్రంలో చేప పిల్లల్ని వదులుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తదితరులు

కొత్తకోట, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఉచితంగా చెరువుల్లో చేపపిల్లల్ని వదలడం వల్ల మత్స్యకారులకు ఉపాధి అవకాశం ఉంటుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం శంకరసముద్రం జలాశయంలో 6 లక్షల చేపపిల్లల్ని వదిలారు. మండలంలో మొత్తం 15 లక్షల చేపపిల్లల్ని అన్ని చెరువుల్లో వదులతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ప్రశాంత్, సీడీసీ ఛైర్మన్ గొల్లబాబు,విండో మాజీ అధ్యక్షుడు సురేంద్రనాథ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పీజేబాబు, మత్స్యసంఘం అధ్యక్షుడు రంగస్వామి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మదనాపురం, న్యూస్‌టుడే : మత్స్యకారుల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత చేప పిల్లలను మండలంలోని సరళాసాగర్ జలాశయంలో విడుదల చేసి ఆయన మాట్లాడారు. అనంతరం మండలంలోని నర్సింగాపురం గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీ చెన్నప్ప మరణించడంతో రూ.2 లక్షల పరిహారం ఉత్తర్వును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

30న సీపీఐ రాజకీయ శిక్షణ తరగతులు

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : ఈ నెల 30న పాన్‌గల్‌లో సీపీఐ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీరామ్ తెలిపారు. శుక్రవారం వనపర్తిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శిక్షణ తరగతులకు రాష్ట్ర నాయకులు యం.డి యూసఫ్, ఉమామహేశ్వర్, విజయరాములు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కళావతమ్మ, గోపాలకృష్ణ, జయమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : మండలంలోని ఓ గ్రామంలో బాల్య వివాహాన్ని శుక్రవారం బాల సంరక్షక అధికారులు అడ్డుకున్నారు. స్థానిక పోలీస్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బాల సంరక్షక అధికారి సురేందర్, సీడీపీవో ఇన్‌ఛార్జి బాలీశ్వరి, సూపర్‌వైజర్ షాహీన్‌బేగం, ఛైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ అశోక్ పాల్గొన్నారు.

బాలుడి అప్పగింత



పెబ్బేరు పోలీస్‌స్టేషన్ వద్ద బాలుడిని తీసుకొన్న వెంకటేశ్ శెట్టి

పెబ్బేరు, న్యూస్‌టుడే : జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం బోయ్యగూడెం గ్రామానికి చెందిన రమాదేవి కుమారుడు పృథ్విక్ తో కలిసి హైదరాబాద్ వెళ్లేందుకు ఎర్రవల్లికి వచ్చారు. వరుసగా మూడు బస్సులు రావడంతో ఆమె ఓ బస్సులో.. కుమారుడు మరో బస్సులో ఎక్కారు. ప్రయాణికులు కిక్కిరిసి ఉండటంతో తల్లి గమనించలేదు. పృథ్విక్‌ను ఓ వృద్ధురాలు గమనించి అతనితో కలిసి పెబ్బేరు బస్టాండులో దిగి అక్కడ ఉన్న మహిళా కానిస్టేబుల్ ప్రభావతికి అప్పజెప్పి పరిస్థితి వివరించారు. ఆమె ఠాణాకు తీసుకొచ్చి ఎర్రవల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వివరాలు సేకరించి చరవాణి ద్వార రమాదేవిని, తాత వెంకటేశ్‌శెట్టిని పిలిపించి బాలుడిని పోలీసులు అప్పగించారు.

సీనియర్ సివిల్ జడ్జిగా కవిత



న్యాయమూర్తి కవితను సన్మానిస్తున్న న్యాయవాదులు

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ జూనియర్ సివిల్ జడ్జి కమలాపురం కవితకు సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతిపై వనపర్తికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి కవితకు శుక్రవారం న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు సురేష్ కుమార్, అలంపూర్ కోర్టు సిబ్బంది ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. గద్వాల నుంచి వచ్చిన న్యాయమూర్తి ఉదయ్ నాయక్‌ను సైతం సన్మానించారు. తన సర్వీసులో అలంపూర్‌ను మరిచి పోలేనని న్యాయమూర్తి కవిత పేర్కొన్నారు. అలంపూర్ ఇన్‌ఛార్జి న్యాయమూర్తి ఉదయ్ నాయక్ మాట్లాడుతూ ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు సర్వసాధారణమన్నారు. న్యాయవాదులు నారాయణరెడ్డి, యాదుర్భాష,తిమ్మరెడ్డి, నాగరాజుయాదవ్, శ్రీనివాసులు, ఏజీపీ మధు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

చిట్యాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : ప్రతి విద్యార్థి హక్కులను తెలుసుకుని వాటిని సరైన మార్గంలో సద్వినియోగం చేసుకోవాలని లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ ఉత్తరయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని చిట్యాల గ్రామ శివారులోని చేయూత ఆశ్రమంలో వనపర్తి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీదేవి, న్యాయవాదులు లోక్ అదాలత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భాజపా యువమోర్చా అధ్యక్షుడిగా గోపాల్

ఖిల్లాగణపురం: ఖిల్లాగణపురం మండల భాజపా యువమోర్చా అధ్యక్షుడిగా కొరిగెల గోపాల్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్, జిల్లా పంచాయతీ రాజ్ సెల్ కన్వీనర్ విక్రమ్ శుక్రవారం తెలిపారు. పార్టీకి చేసిన సేవలను దృష్టిలో ఉంచుకుని పదవి ఇవ్వడంపై బాధ్యత మరింత పెరిగిందని ఈ సందర్భంగా గోపాల్ తెలిపారు.

భాజపా సభ్యత్వ నమోదు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : మండలంలోని ఆరేపల్లి, మూలమల్ల, పిన్నంచర్ల గ్రామాల్లో శుక్రవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. పార్టీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మండల నాయకులు వేణు, అంజి, అశోక్‌భూపాల్ తదితరులు సభ్యత్వ నమోదు చేపట్టారు.

వ్యక్తి నిర్మాణమే.. దేశ నిర్మాణం



పెబ్బేరులో ప్రతిజ్ఞ చేస్తున్న కర సేవకులు

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో శుక్రవారం సాయంత్రం కర సేవకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విభాగ్ భోది ప్రముఖ్ కట్టా ప్రభాకర్ మాట్లాడుతూ.. మంచి వ్యక్తి నిర్మాణమే దేశ నిర్మాణమన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిధిగా తెలంగాణ ఫుట్‌బాల్ సంఘం సంయుక్త కార్యదర్శి కృష్ణకుమార్ రెడ్డి, స్వయం సేవకులు, తదితరులు పాల్గొన్నారు.

కరాటే జిల్లా జట్టు ఎంపిక



కరాటే జట్టుతో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా క్రీడల అధికారి సుధీర్ రెడ్డి

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కరాటే పోటీల్లో అండర్-14, 17 విభాగాల్లో జిల్లా కరాటే జట్టును ఎంపిక చేశామని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేందర్ రెడ్డి తెలిపారు. అండర్-14 బాలుర విభాగంలో జింకల కుమార్, శివకుమార్, దర్శిత్, అరవింద్, బాలికల విభాగంలో జోషిక, ప్రణతి, జాహ్నవి, మేఘన ఎంపికయ్యారు. అండర్-17 బాలుర విభాగంలో ఎండీ ఫిరోజ్, అన్వర్, బాలికల విభాగంలో చంద్రకళ, కీర్తన, శృతి ఎంపియ్యారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, క్రీడల అధికారి సుధీర్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కరాటే జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్ద ఘర్షణ

పెబ్బేరు: పటణంలోని ఓ మద్యం దుకాణం వద్ద శుక్రవారం సాయంత్రం యువకుల మధ్య ఘర్షణ జరిగింది. పెబ్బేరు పట్టణానికి చెందిన, శ్రీరంగాపూర్‌కు చెందిన యువకులు ద్విచక్ర వాహనం అడ్డంగా ఉందనే కారణంతో ఘర్షణకు దిగారు. ఒకరినొకరు కొట్టుకోవడంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు యువకులను చెదరగొట్టారు. వీరిలో ఒకరికి గాయాలైనట్లు తెలిసింది. ఇరువర్గాలను ఠాణాకు తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించినట్లు పోలీసులు తెలిపారు.

నిత్యం ట్రాఫిక్ సమస్య



మదనాపురం రోడ్డులో ట్రాఫిక్ తీరిది

కొత్తకోట, న్యూస్‌టుడే : కొత్తకోటలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వినియోగదారులను ఆకర్షించేందుకు వ్యాపారులు రహదారిని అడ్డాగా మార్చుకుని వ్యాపారాలు చేస్తుండటంతో రహదారులు ఇరుకుగా మారుతున్నాయి. ఈ క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని నిలువరించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు.

రోడ్లపై వ్యాపారం

పట్టణంలో ఫుట్‌పాత్ వ్యాపారులుగా ఉంటున్న పూల, పండ్ల, ఇతర వ్యాపారులు వ్యాపార సముదాయాల్లో దుకాణాలు అద్దెకు తీసుకున్నప్పటికీ వ్యాపారం మాత్రం రోడ్డుపై చేస్తున్నారు. ఎనిమిది అడుగుల రహదారిని ఆక్రమించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరేమో దుకాణదారుకు అద్దె చెల్లిస్తూ రోడ్డుపై వ్యాపారం చేస్తున్నారు. ఇటీవల పాలెం ఎంపీటీసీ సభ్యుడు ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం ఎదుట ప్రమాదానికి గురయ్యారు. ట్రాఫిక్ పోలీస్ ఉన్నా నిబంధనలు ఉల్లంఘించే ద్విచక్ర వాహనాల ఫొటోలు తీసి జరిమానా వసూలు చేసేందుకే పరిమితమయ్యారు.



ప్రమాదం అంచుల్లో కూరగాయల విక్రయాలు

విస్తరణకు నోచని రహదారి

పట్టణంలో 40 అడుగుల మేరకు ప్రధాన రహదారులను విస్తరించాలని పురపాలిక నాలుగేళ్ల క్రితం తీర్మానించినప్పటికీ మదనాపురం-వనపర్తి రోడ్డు మాత్రం విస్తరణకు నోచుకోలేదు. ఈ రోడ్డు పూర్తి ఇరుకుగా ఉన్నప్పటికీ దుకాణాల ఎదుట ఫుట్‌పాత్ వ్యాపారం కొనసాగుతూనే ఉంది. ఇక్కడ రోజూ ట్రాఫిక్ స్తంభించిపోతోంది. మలుపులోనే ప్రైవేటు వాహనాలను నిలపడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పురపాలిక పట్టించుకోక పోవడంతో పోలీసులు సైతం ఈ బాధ్యత తమది కాదంటున్నారు.

ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం

ట్రాఫిక్ సమస్య మా దృష్టికి వచ్చింది. పురపాలిక అధికారులతో సమన్వయం చేసుకుని వారానికి రెండు రోజులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సమస్య పరిష్కరిస్తాం.

- మంజునాథ్‌రెడ్డి, ఎస్సై, కొత్తకోట

21న వృత్యంతర శిక్షణ మేళా

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులకు ఈనెల 21న ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్ షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు వనపర్తి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రమేశ్ బాబు తెలిపారు. అర్హులైన ఆసక్తి గల ఉమ్మడి జిల్లా అభ్యర్థులు సంబంధిత ఒరిజనల్ ధ్రువపత్రాలతో http:///www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకుని రాజాపేటలోని ఐటీఐ కళాశాలలో హాజరు కావాలని సూచించారు.

చెట్ల కొమ్మల తొలగింపు

అమరచింత, న్యూస్‌టుడే : ఆత్మకూరు - మరికల్ ప్రధాన బీటీ రహదారి పీజేపీ మస్తీపూర్ మలుపులో ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలు, పిచ్చి మొక్కలను పొక్లెయిన్‌లో ఎస్సై బి.సురేశ్ తొలగించారు. ఆత్మకూరు, అమరచింత వైపు నుంచి వచ్చే వాహనాలకు మలుపులో ఉన్న చెట్లు ప్రమాదకరంగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సమస్యను ప్రజలు పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో ఎస్సై తొలగించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

వీపనగండ్ల (చిన్నంబావి), న్యూస్‌టుడే: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వీపనగండ్ల సమీపంలో జరిగింది. ఎస్సై కె.రాణి తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నంబావి మండలం అమ్మాయిపల్లికి చెందిన బాలచందర్ (20) ఈ నెల 16న ఇంట్లో కలహాలు జరగడటంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడని తెలిపారు. ఈ క్రమంలో బంధువులు వెతుకుతుండగా.. శుక్రవారం అమ్మాయిపల్లి నుంచి వీపనగండ్లకు వెళ్లే రహదారి పక్కన బాలచందర్ ద్విచక్ర వాహనం కనిపించడంతో చుట్టుపక్కల వెతికారు. చెట్టుకు ఉరేసుకున్నట్లు తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

దుకాణాల్లో చోరీ

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని సుభాష్ చౌరస్తా సమీపంలో రెండు కిరాణా దుకాణాల్లో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగిందని ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం రాత్రి యజమానులు దుకాణాలకు తాళం వేసి వెళ్లారు. శుక్రవారం తెరవడానికి వెళ్లిన యజమానులకు షెట్టర్లు తీసి ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించారు. రూ.1500 నగదు, రూ.వెయ్యి విలువ చేసే సరకులను ఎత్తుకెళ్లారని చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలింపు

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్సై సురేశ్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. మండలంలోని మామిడిమాడ గ్రామానికి చెందిన ఎండీ జాఫర్, శ్రీశైలం, కుమ్మరి శాంతయ్య మామిడిమాడ గ్రామశివారులోని గరువు వాగు నుంచి అనుమతులు లేకుండా ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తుండగా సమాచారంతో పోలీసులు వారిని పట్టుకుని ట్రాక్టర్లను ఠాణాకు తరలించి యజమానులపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.